

నేడు రేషన్ డీలర్ పోస్టులకు రాత పరీక్ష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి- పాడేరు : చౌక ధరల దుకాణాల డీలర్ పోస్టుల భర్తీకి రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేషన్ డీలర్ పోస్టుల రాత పరీక్షల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 19న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. . అభ్యర్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి చిరంజీవి పడాల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై.. అంకితభావంతో పనిచేయండి

- జెడ్‌పి సమావేశంలో చైర్‌పర్సన్ సుభద్ర
- బల్క్ డ్రగ్ పార్కు రద్దుకు సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు పట్టు
- సామాజిక పింఛనుదారులపై కక్ష సాధింపు తగదు : గొలుగొండ జెడ్‌పిటిసి గిరిబాబు



జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యలపై అంకిత భావంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలతో పాటు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ పనులు, ఆర్థిక ప్రణాళికలు, తదితర అంశాలపై చర్చ సాగింది. ప్రజలకు, పర్యావరణానికి హాని చేసే బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయడంపై సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ప్రశ్నించారు. తక్షణమే ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. సామాజిక పింఛన్ల తనిఖీలపై గొలుగొండ జెడ్‌పిటిసి గిరిబాబు ప్రశ్నలు లేవనెత్తారు. తొలుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్, వ్యయాలను సభ్యుల ఆమోదం కోసం ఈ సమావేశంలో ప్రవేశపెట్టారు. జిల్లా పరిషత్‌కు సంబంధించి భవనాలు, అతిథి గృహాలు, షాప్‌లు, స్థలాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే విషయమై సూచనలు, సలహాలు సభ్యుల నుంచి కోరారు. ఇతర రాష్ట్రాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు సభ్యులను తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో జిల్లా పరిషత్‌నకు సంబంధించి 19 అతిథి గృహాలు ఉన్నాయని, వాటిలో కొన్నింటికి మరమ్మతులు చేయించి, మరలా వినియోగంలోకి తీసుకొనివస్తామని అన్నారు. మెయింటెనెన్స్‌లో ఇబ్బందులు లేకుండా నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆదాయ వనరులు పెంచుకునేలా, సంస్థ ఆస్తులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు వచ్చేలా సభ్యులు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా ఆదాయం రూ.1589,13,81,635కు, అంచనా వ్యయం రూ.1586,08,58,235కు సంబంధించి సభ్యులు ఆమోదం తెలిపారు.

పొరపాట్లు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

సామాజిక పింఛన్ల పట్ల ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ఎంత వరకూ సమంజసమని గొలుగొండ జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు ప్రశ్నించారు. పింఛన్ల పంపిణీ విషయంలో గత ప్రభుత్వంలో అధికారులు సిక్స్ పెస్ట్ వెరిఫికేషన్ చేసిన తర్వాతే అర్హులకు మంజూరు చేసేవారని, అటువంటప్పుడు పింఛన్ల మంజూరులో పొరపాటు జరిగిందంటే.. అది అధికారుల నిర్లక్ష్యం అవుతుంది తప్ప లబ్ధిదారులు తప్పు చేసినట్లు ఎలా అవుతుందని అడిగారు. పింఛన్ల తనిఖీ పేరిట లబ్ధిదారులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. పొరపాటు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సేవలు చేసి నిరాధరణకు గురైన మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిల కుటుంబాల వారికి పింఛన్ల సదుపాయం కల్పించాలని కోరారు. ఇంజినీరింగ్ శాఖ అధికారులు జెడ్‌పి విధుల ద్వారా చేయించే అభివృద్ధి పనులపై కొంత మేర నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. మండలాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఆస్తుల వివరాలను ఆయా జెడ్‌పిటిసిలకు నివేదిక రూపంలో అందజేయాలని కోరారు. సమావేశంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్, పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కుతో నష్టం : గంగరాజు



బల్క్ డ్రగ్ పార్కుపై ప్రశ్నిస్తున్న అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కుతో ప్రజలకు తీవ్ర నష్టమని, దీన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కు రద్దుకు జెడ్‌పి సమావేశంలో తీర్మానం చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించాలన్నారు. బల్క్ డ్రగ్ పార్కుతో నక్కపల్లి మండలంలో రాజయ్య పేట, వేంపాడు, బుచ్చిరాజుపేట, చందనాడ, డి.ఎల్.పురంల్లో 2001 ఎకరాల్లో పంటలకు నష్టం కలగడమే కాకుండా రైతులు శాశ్వతంగా తమ ఉపాధిని కోల్పోతారని అన్నారు. గతంలో దాదాపు 120 ఎకరాల విస్తీర్ణంలో హెటిరో డ్రగ్ కంపెనీ ఏర్పాటుతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతిందని సమావేశం దృష్టికి తెచ్చారు. హెటిరో వాయు కాలుష్యంతో పంటలు దెబ్బతిన్నాయని, పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. అక్కడి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. ఇప్పుడు మరలా నక్కపల్లి మండలంలో 2001 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారన్నారు. రాజ్యాంగపరమైన ఆమోదం పొందకుండా, పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల ఆమోదాలు లేకుండా బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు తగదన్నారు. ఆ పార్కుతో తలెత్తే పరిణామాలను వివరించారు. మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతారన్నారు. భూగర్భ జలాలు, చెరువులు కలుషితమై పంటలు పండక రైతులు నష్టపోతారన్నారు. వాయు కాలుష్యంతో ప్రజలు అవస్థలపాలవుతారన్నారు. బల్క్ డ్రగ్ పార్కు రద్దుకు పార్టీలకు అతీతంగా కలిసి పోరాడాలని కోరారు. ఈ క్రమంలో నక్కపల్లి జెడ్‌పిటిసి గోసల కాసులమ్మతో కలిసి చైర్‌పర్సన్‌కు వినతిపత్రం సమర్పించారు.

హామీలు అమలు చేయకుంటే ఆందోళన బాట

ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఆందోళన చేస్తామని ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం యూనియన్ జిల్లా సమావేశం కొమరం చెల్లాయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై ఎడిఎంహెచ్ఓతో చర్చలు జరిపినప్పటికీ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండానే జిల్లా డిఎంహెచ్ఓ మనోజ్ కుమార్, రంపచోడవరం 11 మండలాల్లోని 60 ఏళ్ళు నిండిన వర్కర్లను బలవంతంగా ఇంటికి పంపించే పని చేపట్టాలని పిహెచ్‌సిల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం సరి కాదని పేర్కొన్నారు. ఏజెన్సీలో గిరిజనుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని డిఎంహెచ్ఓ నిర్ణయం తీసుకోవాలన్నారు. 25 సంవత్సరాలుగా ఎన్నో కష్టాల్ని ఓర్చుకుంటూ చాలీచాలని గౌరవ వేతనంతో సిహెచ్‌డబ్ల్యులుగా పని చేసి యూనియన్ సహకారంతో ఆశా వర్కర్లుగా ప్రస్తుతం పని చేస్తున్న గిరిజన ఆశావర్కర్లపై ఏ మాత్రం జాలి లేకుండా వ్యవహరించడం దారుణమన్నారు. రంపచోడవరం, చింతూరు ప్రాంతాల్లో ఇద్దరు ఐటిడిఎ పిఒలు, ఎడిఎంహెచ్‌ఒలు ఉన్నప్పటికీ, ఆశావర్కర్స్ యూనియన్‌తో ఏమాత్రం చర్చలు జరపకుండా డిఎంహెచ్‌ఒ ఎందుకు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారో ఐటిడిఎ పిఒ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ప్రభుత్వం రాష్ట్ర యూనియన్‌తో చర్చలు జరిపినా ఒప్పంద జీవోలు విడుదల చేయలేదన్నారు. పైగా ఏజెన్సీలోని అన్ని పిహెచ్‌సిల్లో 60 ఏళ్ళు నిండిన వారిని పని చేయించకూడదని డిఎంహెచ్ఓ పేరుతో ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. డిఎంహెచ్ఓ జారీ చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకొని 60 ఏళ్ళు నిండిన ఆశా వర్కర్లను విధుల్లో కొనసాగించకపోతే ఏజెన్సీ మొత్తం విధులు బహిష్కరణ చేసి సమ్మె బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.



పోషలు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ముదుగుల పోషలుకు సిపిఎం నేతల నివాళి

ప్రజాశక్తి-విఆర్.పురం

సిపిఎం సీనియర్ సభ్యులు ముదుగుల పోషలు మృతి చెందడంతో ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. విఆర్.పురం మండలం పెద్దమట్టపల్లి పంచాయతీ పరిధి వడ్డిగుంపు గ్రామానికి చెందిన ముదుగుల పోషలు (65) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, సిపిఎం బృందం పోషలు స్వగృహానికి వెళ్లి అతని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. పోషలు మృత దేహంపై ఎర్రజెండా కప్పి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ పోషలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని, ఆయన సేవలు మరువలేవని, ఆయన ఆశయాలను సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రకాష్‌రావు, చిక్కాల పద్మారావు, చింతూరు శాఖ సభ్యులు పల్లపు రాములు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు మోదకొండమ్మ తీర్థం

ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ



తీర్థానికి ముస్తాబైన పాడేరు మోదకొండమ్మ ఆలయం

ప్రజాశక్తి-పాడేరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏటా పాడేరులో నిర్వహిస్తున్న మోదకొండమ్మ తీర్థ మహోత్సవం ఈసారి 19న ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారి తీర్థం వైభవంగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణతో ముస్తాబు చేశామన్నారు. భక్తుల దర్శనాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలు భక్తులకు ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నసమారాధనకు అన్ని చర్యలు చేపట్టామన్నారు.కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పణ ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. తీర్థం సందర్భంగా ప్రజా ప్రతినిధులు అధికారులు పుర ప్రజలతోపాటు యావన్మంది భక్తులు అంతా ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు.. ఆలయం వద్ద స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి ముగ్గులు పోటీలు జరుగుతాయని, ఆసక్తి ఉన్న మహిళలందరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని విజేతలతో పాటు పోటీలో పాల్గొన్న మహిళలకు నగదు బహుమతులతో పాటు ప్రత్యేక జ్ఞాపికలు బహుమతులు అందజేస్తామని తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు ముగ్గుల పోటీలను అన్నసంతర్పణ ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పాదాలను పల్లకిలో ఉంచి భక్తుల సందర్శనార్థం పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. భక్తులందరూ పెద్దసంఖ్యలో పాల్గొని మోదమ్మ తీర్థం జయప్రదం చేయాలని కోరారు.

తిరుగు ప్రయాణికులతో కిటకిట



ప్రయాణికులతో రద్దీగా ఉన్న పాడేరు ఆర్‌టిసి కాంప్లెక్స్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఆర్‌టిసి బస్‌కాంప్లెక్స్ శనివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. సంక్రాంతికి వచ్చిన వారంతా తిరుగు ప్రయాణాలు చేస్తుండడంతో మూడు రోజులుగా బస్‌కాంప్లెక్స్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్నవారంతా పండగ సందర్భంగా సొంతూళ్లకు చేరుకోగా, అత్తమామల ఇంటికి వచ్చిన అల్లుళ్లు, కూతుళ్ల కుటుంబాలన్నీ తిరుగు ప్రయాణం కావడంతో ఆర్టీసీ కాంప్లెక్స్, బస్ స్టేషన్ ఎదురుగా నిలిపిన పాడేరు నుంచి చోడవరం వెళ్లే ప్రైవేట్ జీపులు స్టాండ్, ఆటోలు, ఇతర వాహనాల్లోనూ ప్రయాణికుల రద్దీ నెలకొంది. 12 గంటల తర్వాత నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో సందడి కనిపించింది. విశాఖపట్నం, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కాకినాడ ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి. సంక్రాంతి మూడురోజులూ బోసిపోయినట్లు కనిపించిన పాడేరు పట్టణంలోని ఖాళీ రోడ్లు, ఇపుడు జన సంచారం, వాహనాల రాకపోకలు పెరగడంతో ట్రాఫిక్ పెరిగింది. ఆదివారం కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

ప్రజా భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధన

స్వచ్ఛ దివస్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్



పాడేరులో మాట్లాడుతున్న జెసి అభిషేక్ గౌడ



రంపచోడవరంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషాదేవి, ఐటిడిఎ పిఒ కట్టా

ప్రజాశక్తి -పాడేరు

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధన సాధ్యమని సంయుక్త కలెక్టర్ డా. అభిషేక్ గౌడ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ గ్రామాలలో ఘన వ్యర్థాల నిర్వహణ, సంపద సృష్టి, పరిశుభ్రత కార్యక్రమాలలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం తప్పనిసరిగా స్వచ్ఛ దివస్ నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చి దిద్దడానికి, ఇప్పటికే సేకరించిన ప్లాస్టిక్ ను రి సైక్లింగ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల పరిశుభ్రతకు అందరం భాద్యత తీసుకోవాలన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన తడిపొడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారీ, తాగునీటి వనరుల క్లోరినేషన్, మతపరమైన ప్రదేశాల పరిశుభ్రత, బహిరంగ మల విసర్జన లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక రైతు బజారులో నిల్వ ఉన్న చెత్తను తొలగించడంతో పాటు, అక్కడ దుర్గంధ భరితంగా ఉన్న కాలువలను పూడిక తీసి పరిశుభ్రం చేయించారు. ముందుగా అంబేద్కర్ కూడలి వద్ద మానవ హారంగా ఏర్పడి స్వచ్ఛాంద్ర, స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. జిసిసి చైర్మన్ కె.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, స్వచ్ఛత ప్రజల జీవనంలో భాగం కావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, చెత్త రహిత సమాజస్థాపన ప్రతిఒక్కరి బాధ్యత కావాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ వి.కాంతమ్మ, మాజీ మంత్రి పి.మణికుమారి, మాజీ ఎంపిపి బి.విజయరాణి, జిసిసి డైరెక్టర్ బి.నాగరాజు, స్థానిక సర్పంచ్ కె.ఉషారాణి, సర్పంచులు పాండురంగ స్వామి, పార్వతమ్మ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : మండలంలోని అరకు సర్పంచ్ జి శారద ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛదివస్‌లో రోడ్డుకు ఇరువైపులా కాలువల్లోని పూడికల తొలగింపు, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ప్రజా ప్రతినిధులు,సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

జి.మాడుగుల : ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా మండల కేంద్రంలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి ఆధ్వర్యంలోపరిసరాల పరిశుభ్రతపై అవగాహన, డ్రైనేజీలు, తాగునీటి ట్యాంకులు పరిశుభ్రతపై అవగాహనకు ర్యాలీ చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వి.విజయకుమార్, సర్పంచ్ కె.రాంబాబు, ఎంపిటిసి, అధికారులు పాల్గొన్నారు.

చింతపల్లి: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా మండల కేంద్రంతోపాటు పంచాయతీ కేంద్రాలలో పారిశుధ్య పనులు చేపట్టారు. చింతపల్లి సర్పంచ్ దురియ పుష్పలత, ఎంపిడిఒ యు.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మురుగు కాలువలు, పంచాయతీ పరిసర ప్రాంతాలను శుభ్రపరచారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి పాత బస్‌స్టాండ్ కూడలి వరకు ర్యాలీ, పాత బస్‌స్టాండ్ కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఏజెన్సీ ప్రజలందరూ భాగస్వాములు కావాలని రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ర్యాలీలో ఎమ్మెల్యే శిరీష దేవి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిరీష దేవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతి నెల మూడో శనివారం ప్రతి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం 12 నెలలపాటు 12 రకాలుగా నెలకొక కార్యక్రమం చొప్పున నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిపి బంధం శ్రీదేవి, జడ్పిటిసి పండ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె.బాలకృష్ణ, ఎంపీటీసీలు కె.వంశి, ఉలవల లక్ష్మి, గెద్దాడ సర్పంచ్ వి.ప్రసాద్, మండల ప్రత్యేక అధికారి షరీఫ్, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, డిఎల్‌పిఓ పి.నర్సింగరావు, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, తహశీల్దారు పి.రామకృష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.లక్ష్మణ్, మండల విద్యాశాఖ అధికారి కె. సత్యనారాయణ, అడబాల బాపిరాజు, యం.వీరబాబు, అప్పారావు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా : చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ ఆధ్వర్యాన చింతూరు ప్రధాన కూడలిలో మానవహారం చేసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బస్ స్టాండ్ వరకు ర్యాలీ చేశారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో శాపిడ్ సంస్థ ప్రతినిధులు అహ్మద్ అలీ బృందం, యంపిపి అమల, డిప్యూటీ డియంహెచ్ఓ పుల్లయ్య, యఫ్ఆర్ఓ అబ్దుల్ కలం ఆజాద్, తహశీల్దార్ చిరంజీవి, ఈఓపిఆర్‌డి జి.మోహన్‌రావు, అన్ని శాఖల ఉద్యోగస్తులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ అధికారులు



అరకు సర్పంచ్ ఆధ్వర్యాన పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం



ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న జమాల్‌ఖాన్

ఆర్చరీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా

చింతూరు మండల కేంద్రంలో జెకెసి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్, ఆర్చరీ పోటీలకు ట్రస్టు చైర్మన్, ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలన్నారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహిస్తూ దురలవాట్లకు, వ్యసనాలకు, కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణతో వ్యాయామం చేయాలని, క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ సభ్యులు రియాజ్, షాజహాన్, విక్కీ, పి.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం కొండగోకిరి గ్రామంలో లోకుల గాంధీ వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఎస్ఐ కిషోర్ వర్మ, రిషి స్టడీ సర్కిల్ డైరెక్టర్ మురళీకృష్ణా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 40 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు దిలీప్ కుమార్, మనోజ్ కుమార్, స్వామి, రాజా తెలిపారు కార్యక్రమంలో కొండగోకిరి సర్పంచ్ ముసిలి నాయుడు, బీజేపీ మండల అధ్యక్షులు సంపరి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ కిశోర్‌వర్మ తదితరులు

ఘనంగా ఎన్‌టిఆర్ వర్ధంతి


రంపచోడవరంలో నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి తదితరులు

ప్రజాశక్తి-రంపచోడవరం
మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్లో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి విజయ్‌భాస్కర్, మాజీ శాసనసభ్యులు చిన్నం బాబు రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌టి రామారావు ప్రజా నాయకుడిగా చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పి.మోహన్, అడబాల బాపిరాజు, వై.నిరంజనీదేవి, సలాది బాపిరాజు, పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి వేడుకలను టిడిపి ఆధ్వర్యంలో శనివారం రాజవొమ్మంగిలో ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దంతులూరి శివరామచంద్రరాజు, గొల్లపూడి పెద్దిరాజు, జెట్టి అప్పారావు, సావిత్రి, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విఆర్.పురం : విఆర్.పురం మండలం రేఖపల్లి జంక్షన్లో ఎన్టీఆర్ విగ్రహానికి జెకెసి ట్రస్టు చైర్మన్ జమాల్ ఖాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెకె చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విఆర్ పురం మండలంలో ఇటీవల మృతి చెందిన పెద్దమట్టపల్లి గ్రామస్తులు పోషాలు, అన్నవరం గ్రామానికి చెందిన కారం బొజ్జి, పోచవరం గ్రామానికి చెందిన కనకారెడ్డి, గుర్రంపేటకు చెందిన పూనం వెంకయ్య బాధిత కుటుంబాలకు మూడు వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి వాళ్ళ రంగారారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి నేతలు ఆచంట శ్రీనివాసరావు, బొర్ర నరేష్, సిద్దు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కూనవరం : ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా కూనవరంలో ఆయనకు జమాల్ ఖాన్ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పళ్ళు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బరపాటి ప్రకాష్‌రావు, ఎడవల్లి భాస్కరరావు, పోడియం అప్పారావు, మాజీ జెడ్పిటిసి కన్యకా పరమేశ్వరి, కట్టం సునీత, గడేసుల ప్రేమచంద్ పాల్గొన్నారు.

కొయ్యూరు : కొయ్యూరు మండలం రాజేంద్రపాలెంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి యంవివి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్ర పటానికి నివాళులర్పించి, అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మాకాడ బాలరాజు, జె.వెంకటలక్ష్మి, పి.సింహాచలం, టిడిపి నాయకులు అప్పలరాజు, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

సీలేరు : జీకేవీధి మండలం సీలేరు మార్కెట్ సెంటర్లో ఎన్టీఆర్ చిత్రపటానికి సీనియర్ టిడిపి నాయకులు బొర్ర కృష్ణ, కె.సన్యాసిరావు, వార్డ్ మెంబర్ చిటికెల రాము, గోవింద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ముంది చంద్రరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిలో గ్రూపు విభేదాలు

పెదబయలు : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో టిడిపిలో గ్రూపు విభేదాలు బహిర్గతమయ్యాయి. సివేరి అబ్రహం ఒకవర్గంగా, మాజీ సర్పంచ్ తెసాబు త్రినాద్, తెలుగు యువత అధ్యక్షులు లొట్టి త్రినాద్, చిన్న వేరొక గ్రూపుగా వేర్వేరుగా ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు.

రాజకీయ చైతన్యస్ఫూర్తి ఎన్‌టిఆర్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: రాజకీయ వ్యవస్థ దశ దిశను మార్చిన చైతన్యమూర్తి అన్న ఎన్‌టిఆర్ అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎపిఎస్ఆర్‌టిసి విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర అన్నారు. శనివారం అరకులోయ మండల కేంద్రంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని టిడిపి శ్రేణుల సమక్షంలో ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొన్ను దొర మాట్లాడుతూ, తెలుగు జాతి బతికున్నంత కాలం ఎన్టీఆర్ జీవించే ఉంటారన్నారు. భావితరాలకు ఎన్‌టిఆర్ జీవితం ఒక స్ఫూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి అరకు మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, సీనియర్ నాయకుడ సుంకరమెట్ట మాజీ సర్పంచ్ పెట్టేలి రాము, పద్మాపురం మాజీ సర్పంచ్ మహాదేవ్ , వైస్ ప్రెసిడెంట్ చందు, పెదలబుడు వార్డ్ సభ్యులు గొల్లోరి సోమరాజు, ఎల్‌బి లక్ష్మణరావు, అర్జున్, మాజీ ఎస్ పిటిసి స్వాభి, స్వాభి దొన్ను, గొల్లోరి రాజు, మాదల సర్పంచ్ వంతల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చింతపల్లి : తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా వ్యాపింపజేసి తెలుగు జాతికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఎన్‌టిఆర్ చిరస్మరణీయుడని పలువురు నేతలు కొనియాడారు. స్థానిక పాత బస్టాండ్ కూడలిలో ఎన్‌టిఆర్ నిలువెత్తు విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షుడు కిలో పూర్ణ చంద్రరావు ఆధ్వర్యంలో అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, చల్లంగి లక్ష్మణరావు, సీనియర్ నాయకులు పెదిరెడ్డి బేతాళుడు, దేపూరి వెంగళయ్య, మండల ఉపాధ్యక్షుడు ఆండ్రాయి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, అరకు పార్లమెంట్ బిసి సెల్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ నాగభూషణం తదితరులు గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మాజీ మండల అధ్యక్షులు, బేరా సత్యనారాయణ, గోకాడ సత్యనారాయణ, నాయకులు దొరబాబు, జి మంగు, కంట వెంకటరమణ, షేక్ ఖాసిం వల్లి, జి అబ్బాయి నాయుడు,, మామిడి రాజబాబు, చెన్నకేశవ సోమేశ్వరరావు, ఏనుగుల సత్యనారాయణ, మంగులు ఉపేంద్ర, చిందాడ అప్పారావు, మహిళా నాయకురాలు దేపూరి కృష్ణవేణి, బేతా నూకరత్నం, సేవా ఈశ్వరమ్మ, జనసేన నేతలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.


ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దొన్నుదొర, నాయకులు

ఏరులై పారిన మద్యం

ఊరూరా విచ్చలవిడిగా వెలసిన బెల్ట్‌షాపులు
యథేచ్ఛగా అధిక ధరలకు మద్యం

ప్రజాశక్తి -జి.మాడుగుల: సంక్రాంతి పండగ వేళ గ్రామాల్లో మద్యం ఏరులై పారింది. ఊరూరా బెల్ట్‌షాపులు తెరుచుకున్నాయి. మండల కేంద్రంలో ప్రభుత్వ అధికారిక మద్యం దుకాణం ఉన్నప్పటికీ, పండుగ రోజుల్లో కేవలం మద్యం కోసమే మండలకేంద్రానికి వచ్చి మద్యం కొనుక్కుని వెళ్లేందుకు మందుబాబులకు ఇబ్బంది లేకుండా ఉండేలా గ్రామాల్లో బెల్ట్‌షాపులు వెలిశాయి. అధికధరకు బెల్ట్‌షాపుల్లో మద్యాన్ని విక్రయించినప్పటికీ, మండలకేంద్రానికి వచ్చి వెళ్లకుండా, గ్రామాల్లోని అనధికార బెల్ట్‌షాపుల్లోనే మందుబాబులు కొని, తాగి ఊగిపోయారు. దీంతో అనేక గ్రామాల్లో యథేచ్ఛగా బెల్ట్‌షాపులు వెలియగా, క్వార్టర్ బాటిల్‌పై రూ20 అంతకంటే ఎక్కువ ధరకే బెల్ట్‌షాపుల నిర్వాహకులు అమ్మకాలు చేపట్టినప్పటికీ, మందుబాబులు ఏమాత్రం తగ్గకుండా అక్కడే కొనుగోలు చేశారు. అధికారిక మద్యం దుకాణాల నుంచే ఎంఆర్‌పి కంటే రూ.పది ఎక్కువగా బాటిల్‌పై ధరపెంచి, బెల్ట్‌షాపులకు సరఫరా చేయగా, బెల్ట్‌షాపు నిర్వాహకులు మరో రూ.పది నుంచి రూ.20 వరకు అదనంగా వేసి మద్యాన్ని విక్రయించడం ద్వారా మందుబాబుల జేబులను గుల్ల చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం అమ్మకాలను పెంచడానికే అన్నట్టుగా లోపాయికారీ సహకారం అందించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నేరాలు ఘోరాలు

గ్యాస్ లీక్ ఘటనలో మహిళ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : గ్యాస్ లీక్ ఘటనలో గాయాలై చికిత్స పొందుతున్న మహిళ శనివారం మృతి చెందింది. గత సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన పాత డైరీ ఫారం ఇందిరాగాంధీ నగర్లో జరిగిన గ్యాస్ లీక్ ఘటనలో ఇద్దరు మహిళలు, మరో వ్యక్తి, ఇద్దరు పిల్లలు గాయపడిన విషయం విదితమే. వీరు అప్పటి నుంచి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో ఎక్కువ శాతం శరీరం కాలిపోయిన తిరుమలరెడ్డి సత్యవతి(27) శనివారం మృతి చెందింది. ఈమె ఇద్దరి పిల్లలు చికిత్స పొందుతున్నారు. సత్యవతి మృతితో ఇందిరాగాంధీ నగర్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదభరిత కల్వర్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేత చిన్నస్వామి

బురద గెడ్డ వంతెనకు మరమ్మతు చేయరూ!

కల్వర్టుపై రంధ్రం, అంచుల్లో కోతతో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : అరకు పంచాయతీ బురద గెడ్డపై ప్రమాదకరంగా ఉన్న వంతెన మరమ్మతు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాచిపెంట చిన్నస్వామి డిమాండ్ చేశారు. శనివారం బురదగెడ్డ వంతెన వద్ద రోడ్డుపై భారీ రంధ్రం ఏర్పడడంతో ప్రమాదభరితంగా మారిన వంతెనను పరిశీలించారు. ఈసందర్భంగా చిన్నస్వామి మాట్లాడుతూ, బురద గెడ్డ వంతెనపై రక్షణగోడలను ఆనుకుని, రెండువైపులా రోడ్డు కోతకు గురికావడంతో దాన్ని నామమాత్రంగా మట్టితో కప్పి వదిలేశారని, దీంతో ఇక్కడ ఏమాత్రం ఆదమరిచి వచ్చినా వాహనదారులు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలువురు బైకిస్టులు ప్రమాదానికి గురైన సందర్భాలు ఉన్నాయన్నారు. అరకు, పాడేరు ప్రధాన రహదారి కావడంతో ఇదే మార్గంలో ప్రజాప్రతినిధులతోపాటు ఉన్నతాధికారులు అనునిత్యం రాకపోకలు సాగిస్తున్నా బురదగెడ్డ వంతెనపై ఇరుకుగా ఉన్న కల్వర్టు కోతకు గురైనా, దానికి మరమ్మతులు చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. ప్రస్తుతం ఏజెన్సీల అందాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకుల వాహనాలు ఇదేమార్గంలో ప్రయాణం చేస్తున్నాయని, ప్రస్తుతం పొగమంచు విపరీతంగా కురుస్తున్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డు పూర్తిగా కనిపించని పరిస్థితుల్లో అధిక ప్రమాదాలకు ఆస్కారముందని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, బురదగెడ్డ కల్వర్టు వద్ద మరమ్మతులు చేపట్టాలని కోరారు.

గొట్టిపల్లిలో రీసర్వే

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి రెవెన్యూలో సోమవారం నుంచి రీ సర్వే ప్రారంభిస్తామని మండల తహశీల్దార్ పేర్ల శ్యాంప్రసాద్ తెలిపారు. ఐదు బృందాలతో సర్వే పనులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులందరూ అందుబాటులో ఉండాలని కోరారు. సర్వేయర్లతోపాటు విఆర్‌ఒలు పాల్గొంటారని, ఏమైనా సందేహాలుంటే విఆర్‌ఒను సంప్రదించాలని సూచించారు.

20న సర్వీస్ ప్రొవైడర్ల మేళా

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సర్వీస్ ప్రొవైడర్స్ మేళా నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమప్రసన్న వాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెప్మా, హోమ్ ట్రయాంగిల్ సంస్థ సంయుక్తాధ్వర్యాన స్థానికంగా ఉన్న సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని స్థానిక సర్వీస్ ప్రొవైడర్లకు సూచించారు.


మాట్లాడుతున్న పిఒ కట్టా సింహాచలం

ఆర్థికాభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని వందన్ వికాస కేంద్రాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఏడు మండలాల వందన్ వికాస కేంద్రాల అధ్యక్షులు, ఎపిడి, డిపిఎంలు, ఎపీఎంలు, సీసీలతో శనివారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా వందన్ వికాస కేంద్రాలు ఏజెన్సీ ఏడు మండలాల్లో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏడు మండలాల్లో 114 వందన్ వికాస కేంద్రాలు ప్రస్తుతం ఉన్నాయని, ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల చొప్పున వివిధ రకాలైన అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయుటకు మంజూరు చేసినట్లు చెప్పారు. వందన వికాస కేంద్రాల సభ్యులు జీడిపిక్కలు, కొండ చీపుర్లు, చింతపండు, పసుపు, జాఫరాలు వంటివి కొనుగోలు చేసి ప్రాసెసింగ్ అనంతరం జిసిసి ద్వారా మార్కెట్‌కు పంపే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఉత్పత్తులు తరలించే విధంగా మినీ వాహనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి వందన్ వికాస కేంద్రానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా రైస్ మిల్లు కూడా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ముందుగా 4 వందన్ వికాస కేంద్రాల ఏర్పాటైన పీవీటీజీలకు కావలసిన మిషనరీలు కొనుగోలు చేసి అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఇంకా వందన వికాస కేంద్రాలలో జాయిన్ కాని అన్ని గిరిజన తెగల వారు జాయిన్ చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిడి పి.డేగలయ్య, డిపిఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : ఈ నెల 16 నుండి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరుగుతున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్, బ్యానర్, స్టిక్కర్లను చింతూరులో స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఆర్టిఎ యూనిట్ ఆఫీస్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.చెల్లారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి నియంత్రణకు చర్యలు


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ శాఖల్లో జరిగిన అవినీతి నియంత్రణ చర్యలపై రాజీ పడకుండా ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తామని ఎపి ప్రభుత్వ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒఎస్‌డిగా బాధ్యతలు స్వీకరించిన కింజరాపు ప్రభాకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శనివారం ఆయన విశాఖపట్నం ప్రాంతీయ నిఘా, అమలు శాఖలో ఒఎస్‌డిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వానికి సంబంధించిన ఏ శాఖలోనైనా అవకతవకలు జరిగినా, ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు చెల్లించక పోయినా, ప్రభుత్వ ధనాన్ని వృథా చేసినా, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు కాకపోయినా విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరాల్సి ఉందన్నారు.

ప్యాకేజీ 'ఉక్కు' ఊపిరి నిలుపుతుందా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
'తాంబూళాలిచ్చాం...తన్నుకు చావండి'... మా బాధ్యత ఇంకేమీ లేదు.. అన్న చందాన కూటమి పాలకులు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో తాజాగా మాటలు వల్లెవేస్తున్నారు. అంటే చేయాల్సిందంతా చేసేశాం. తమ బాధ్యత అయిపోయింది.. అన్నదే వారి మాటల సారాంశం. వాస్తవానికి ఈ రూ.11440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ నాలుగేళ్లుగా స్టీల్ కార్మికులు, ఈ ప్రాంత ప్రజలు నిర్వహిస్తున్న ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాన్ని ఆపగలుగుతుందా ? ఉక్కు ఫ్యాక్టరీకి ఊపిరి నిలబెడుతుందా ? ఈ ప్యాకేజీ వెనుక రాజకీయం ఏమైనా ఉందా ? ఇటీవల విశాఖ వేదికగా 'కూటమి' ఆధ్వర్యాన ప్రధానమంత్రి మోడీ పాల్గొన్న సభలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అటు మోడీ, ఇటు చంద్రబాబు, పవన్ ఎవ్వరూ మాట మాత్రం చెప్పకుండా ఇప్పుడు ఈ ప్యాకేజీ ఎలా తెరపైకి వచ్చేసింది అన్న ప్రధాన ప్రశ్నలు, సందేహాలు పలువురి నుంచి తాజాగా వినిపిస్తున్నాయి. ఎలాగైతేనేమీ ఆర్థిక ప్యాకేజీ రూ.వేల కోట్లు ఉక్కు పరిశ్రమకు కష్టకాలంలో వచ్చిందనుకునే వారూ లేకపోలేదు.

ఏం జరుగుతోంది ?
వాస్తవాలేమిటి ?

2021 జనవరిలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆధ్వర్యానగల ఎకనమిక్ ఎఫైర్స్ కమిటీ 100 శాతం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ / అమ్మకానికి పెడుతూ నిర్ణయం చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ విశాఖ కార్మికవర్గం, ఉత్తరాంధ్ర ప్రజానీకం, సిపిఎం, ఇతర వామపక్షాలు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన గడిచిన నాలుగు సంవత్సరాలుగా పోరాటాలు సాగుతున్నాయి. 2024లో కేంద్ర, రాష్ట్రాల్లో 'కూటమి' డబుల్ ఇంజిన్ సర్కారు వచ్చాక ప్యాకేజీ వదిలారు.. దీని వెనుక రాజకీయ వ్యూహం ఉందన్న ప్రచారం సాగుతోంది. ఒక ఆంగ్ల దినపత్రికలో ఈ ప్యాకేజీపై వచ్చిన వార్త ప్రకారం.. జపనీస్ కంపెనీని త్వరలో షేర్ హోల్డర్‌గా చేసేందుకు మోడీ సర్కారు ఈ ప్యాకేజీని రీస్ట్రక్చరింగ్ కోసం సిద్ధం చేసిందన్నది సారాంశం. కొత్తగా ఉక్కు పరిశ్రమలోకి భాగస్వామిగా రావాలంటే అప్పు వేల కోట్ల రూపాయలు కనిపించకూడదు కాబట్టి ప్యాకేజీగా ఇచ్చిన డబ్బును ఉక్కు పరిశ్రమ అప్పుకు జమచేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇలాగే గతంలో పోస్కో కూడా స్టీల్‌ప్లాంట్ బోర్డులోకి జొరబడేందుకు, ఉక్కు పరిశ్రమను కాజేసేందుకు కాలుమోపాలని చూడగా కార్మికవర్గం ఈ యత్నాలను చైతన్యంతో తిప్పికొట్టింది. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్ 100 శాతం ప్రభుత్వ రంగ పరిశ్రమ. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లోకి రెండే నడుస్తున్నాయి. పూర్తిస్థాయి సామర్థ్యంతో మూడూ నడవాలంటే రూ.7500 కోట్లు అవసరం అవుతుంది. ఇంకా ఆధునికీకరణ పనులకూ నిధులు అవసరం అయినందున కేంద్రం ఈ ప్యాకేజీ ఇచ్చిందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 20 వేల ఎకరాలుగల స్టీల్ ఆస్తులే రూ.21 లక్షల కోట్లుంటే ఈ ప్యాకేజీలు దేనికన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది.



ప్లాంట్ నడవాలంటే..

సొంత గనులను స్టీల్‌ప్లాంట్‌కు ఇవ్వాలని, సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేస్తోంది. సొంత గనులు లేనందున ఇప్పటికే రూ.12 వేల కోట్లు నష్టం ప్లాంట్‌కు వాటిల్లింది. ఈ సమయంలో ఇప్పుడిచ్చిన రూ.11440 కోట్లు ఏ మూలకు వస్తుంది అన్నది పలువురి ప్రశ్న. ఒక సంవత్సరం ముడిఖనిజం ఖర్చు రూ.18 వేల కోట్లు ప్లాంట్‌కు అవుతోంది. ఇలాంటి ప్యాకేజీ కోసం కార్మికవర్గం పోరాడిందనుకుంటే 'కూటమి' నేతలు ప(త)ప్పులో కాలేసినట్టే. దీన్ని అమ్మకానికి పెట్టిన మోడీ తన నిర్ణయం నుంచి వెనక్కి వచ్చినట్టు కూటమి పాలకులు హామీ ఇవ్వగలరా? అన్నది ప్రధాన ప్రశ్న. మూడు నెలల క్రితం రూ1640 కోట్లును ప్లాంట్‌కు ఇచ్చారు. ఆ డబ్బులు అయిపోయాయి. కార్మికులకు ఐదు నెలలుగా జీతాల్లేవు. తాజా ప్యాకేజీలో జీతాలు చెల్లిస్తారా ? ఏం చేస్తారు ? అనేది ప్రభుత్వం స్పష్టతనివ్వలేని స్థితి కొనసాగుతోంది.

విశాఖ మార్కెట్‌లోకి హ్యుందాయ్ క్రెటా ఇవి



రామాటాకీస్ వద్దనున్న లక్ష్మీ హ్యుందాయ్ షోరూంలో కారును ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో ఆటోమొబైల్ రంగంలో ప్రఖ్యాతిగాంచిన లక్ష్మీ హ్యుందాయ్ వారు హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారును శనివారం ఉదయం రామా టాకీస్ వద్ద ఉన్న లక్ష్మీ హ్యుందాయ్ శాఖతోపాటు గాజువాక శాఖలో ప్రారంభించారు. లక్ష్మీ హ్యుందాయ్ గ్రూప్ సిఇఒ డాక్టర్ వి.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ (అకౌంట్స్ అండ్ ఫైనాన్స్) కిషోర్ కుమార్‌ల ఆధ్వర్యంలో రామా టాకీస్ శాఖ వద్ద జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎల్‌వి.గంగాధర శాస్త్రి, బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ పిఎం ప్రధాన్‌లు హాజరై నూతన వాహనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా గాజువాక శాఖ వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెట్రో రీజినల్ మేనేజర్ సంజిత్ కుమార్ దెబ్నాథ్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ గోపాల్ హాజరై ఈ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ హ్యుందాయ్ సంస్థ సిఇఒ డాక్టర్ వి.శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలు కలిగిన ఈ హ్యుందాయ్ క్రెటా వాహనం ఇవి రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతుందని అన్నారు. ఈ వాహనం ఎక్స్ - షోరూమ్ ధర రూ.17.99 లక్షల నుంచి రూ.24.37 లక్షలు వరకు ఉంటుందని తెలిపారు. అనంతరం మొదటి కొనుగోలుదారుడైన ముఖేష్ జైన్‌కు ముఖ్య అతిథుల చేతుల మీదుగా తాళాలు అందజేశారు. కార్యక్రమంలో ఖాతాదారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవంలో కమిషనర్ సంపత్ కుమార్

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జన క్రాంతి ట్రస్ట్ సహకారంతో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శనివారం జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఉన్న యువత కంప్యూటర్ నైపుణ్యత పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇటువంటి స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో నడిచే శిక్షణ తరగతుల్లో శిక్షణ పొందడం వల్ల నైపుణ్యతతో పాటుగా బయట పోటీ ప్రపంచానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానం పరిపూర్ణంగా అందుతుందని తెలిపారు. నగరంలో ఉన్న యువత అందరూ ఈ సెంటర్‌ను వినియోగించుకోవాలని కోరారు. పోటీ ప్రపంచంలో వచ్చే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు కావలసిన కంప్యూటర్లను రూ.10 లక్షల వ్యయంతో జన క్రాంతి ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ శివప్రసాద్ అందించారని చెబుతూ అందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు ఎల్లాజీ మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణలో భాగంగా నేటి యువతరానికి అవసరమైనటువంటి ఫండమెంటల్స్ ఆఫ్ కంప్యూటర్స్, వెబ్ టెక్నాలజీ, ఐటి కోర్సులు, అకౌంటింగ్, మల్టీ మీడియా, సోషల్ మీడియాకు సంబంధించినటువంటి కోర్సులను నామమాత్రపు రుసుముకు అందిస్తామన్నారు. రోజుకు నాలుగు షిఫ్ట్‌లు ఉంటాయన్నారు. ప్రస్తుతం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ ఒక బ్యాచ్‌కు, సాయంత్రం 5:30 గంటల నుంచి 7:30 వరకు మరో బ్యాచ్‌కు కంప్యూటర్ నిపుణులచే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కంప్యూటర్ శిక్షణకు ఎటువంటి వయో పరిమితీ లేదని, కంప్యూటర్ నేర్చుకోవాలనే కుతూహలం ఉంటే చాలని తెలిపారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు, దండు నాగేశ్వరరావు, టి.కామేశ్వరరావు, ఎంఆర్‌డి.రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం హర్షించదగ్గ విషయమే అయినా, అది శాశ్వత పరిష్కారం కాదన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1390వ రోజుకు చేరాయి. దీక్షల్లో యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో విఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని, ఐదు వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరంలో కూర్చున్న వారిలో గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జెఅర్.నాయుడు, శేషు, ఎం.ఈశ్వరరావు, రాజు తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ మనుగడకు ప్యాకేజీ చాలదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు ప్రకటించిన ప్యాకేజీ వెంటిలేటర్‌పై ఉన్న స్టీల్ ప్లాంట్‌కు ఆక్సిజన్ మాత్రమేనని, స్టీల్‌ప్లాంట్ మనుగడకు ఈ ప్యాకేజీ ఎంత మాత్రమూ సరిపోదని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం మధ్యాహ్నం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం సంతోషమే అయినా, అది అప్పులకే సరిపోతుందని అన్నారు.